# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సమాజంలో విజయం సాధించిన వారు సమాజం కోసం తిరిగి ఖర్చు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.**
2. **రెండున్నర ఏళ్లలో లక్ష ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
3. **తెలంగాణలోని కాజీపేట రైల్వే పరిశ్రమ ఏర్పాటుతో మూడు వేల ఉద్యోగాలు వస్తాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు.**
4. **కేంద్ర నుంచి అనుమతులు తీసుకుని పోలవరం -బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.**
5. **మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత మహిళల క్రికెట్ జట్టు ఈరోజు ఇంగ్లండ్‌తో రెండో వన్డే ఆడనుంది.**

==========================

సమాజంలో విజయం సాధించిన వారు సామాజిక బాధ్యతగా సమాజం కోసం తిరిగి ఖర్చు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ – పీ4 కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన మార్గదర్శకులకు నిన్న ఆయన విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంపన్నులు పేదలకు సహాయం చేస్తే పేదరికం తగ్గుతోందని పేర్కొన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు. అక్కడ కపిల తీర్థంలో శ్రీ కపిలేశ్వరస్వామిని వారిని దర్శించుకుంటారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజా వేదిక నిర్వహిస్తారు. ఈ సాయంత్రం అలిపిరి వద్ద ఉన్న కంచి కామ కోటి పీఠాన్ని ముఖ్యమంత్రి సందర్శిస్తారు.

---------------------------

రెండున్నర ఏళ్లలో లక్ష ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.

నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

– వాయిస్..35 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన నిధులు ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్లమెంటు సభ్యులకు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై నిరంతరం కేంద్ర మంత్రులతో పార్లమెంట్ సభ్యులు మాట్లాడాలని తెలిపారు. రైతులకు మద్దతు ధర, నదీ జలాలు, పారిశ్రామికీకరణ వంటి అంశాలను పార్లమెంటులో ప్రస్తావించాలని పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యుల పనితీరును ఆయన ప్రశంసించారు.

---

తెలంగాణలోని కాజీపేట రైల్వే పరిశ్రమతో మూడు వేల ఉద్యోగాలు వస్తాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం నిన్న నిర్వహించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ యూనిట్టును కోచ్ వ్యాగన్ల నుంచి ఇంజన్ తయారీ వరకు విస్తరిస్తున్నట్లు కేంద్రమంత్రి వివరిస్తూ..

..వాయిస్..27 సెకన్లు

---

కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని పోలవరం –బనకచర్ల ప్రాజెక్టు చేపడతామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి తెలుపుతూ..

– వాయిస్..30 సెకన్లు

---

తెలంగాణలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క తెలిపారు. నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ హైడ్రో పవర్ ప్లాంట్ ను ఉప ముఖ్యమంత్రి నిన్న సందర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని హైడెల్ ప్రాజెక్ట్ లన్నిటినీ పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పునరుత్పాదక వనరులతో భవిష్యత్ మొత్తం కాలుష్య రహిత విద్యుత్ తయారీ చేపట్టేలా ఉత్పత్తి సంస్థలన్నింటిలో సంస్కరణలు చేపడతామని ఆయన వివరించారు.

---

ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు నిన్న గవర్నర్ జస్టిస్ యస్. అబ్దుల్ నజీర్‌ను

మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషన్ వార్షిక ప్రగతి నివేదికను గవర్నర్‌కు అందజేశారు. గిరిజనులకు మెరుగైన విద్య వైద్యం జీవన స్థితిగతులు కల్పించేందుకు కమిషన్ చిత్తశుద్ధితో కృషి చేసిందని ఆయన గవర్నర్ కు వివరించారు. ఎస్టీ కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు ప్రభుత్వానికి చేసిన సూచనలతో పాటు గిరిజనుల స్థితిగతులు మెరుగుకు చేపట్టాల్సిన చర్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పోస్టల్ శాఖ పరిధిలోని 452 పోస్టాఫీసుల్లో సేవలను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నామని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ జె.మధుసూదన్ రావు తెలిపారు. తపాలా శాఖ ఆధునికీకరణ చర్యల్లో భాగంగా ఈరోజు నుంచి ఈ నెల 21వ తేదీ వరకు తపాలా సేవలను నిలిపి వేస్తున్నట్టు ఆయన వివరిస్తూ..

వాయిస్..30 సెకన్లు

----------------------------

వీర స్వాతంత్ర్య సమరయోధులు మంగళ్ పాండే జయంతి ఈరోజు. 1827 జులై 19వ తేదీన ఉత్తరప్రదేశ్లోని సగ్వాలో జన్మించిన ఆయన 9వ ఏటనే బ్రిటిష్ సైన్యంలో చేరారు. బ్రిటిష్ ప్రభుత్వ దుశ్చర్యలను సహించక, వారిపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమరయోధులు మంగళ్ పాండే భారతీయుల ఆలోచనలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలవైపు మళ్ళించిన ఆయన దేశమాత స్వేచ్ఛకోసం ప్రాణాలు త్యాగం చేశారు.

----------------------------

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత మహిళల క్రికెట్ జట్టు ఈరోజు ఇంగ్లండ్‌తో రెండో వన్డే ఆడనుంది. మధ్యాహ్నం ఇంగ్లండ్‌లోని లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. కాగా ఇప్పటికే తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్ ఈ మ్యాచ్‌లో కూడా గెలుస్తే సిరీస్ కైవసం అవుతుంది. ఇక భారత్ ఇంగ్లండ్ నాలుగో టెస్ట్ ఈ నెల 23వ తేదీన ప్రారంభమవుతుంది.

----------------------------

రాష్ట్రం మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితుల గురించి వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్ 20 సెకన్లు

మరోవైపు.. తెలంగాణా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజులపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================